క్లుప్తంగా

వాహన తనిఖీలు ముమ్మరం



మానవపాడు: ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో పోలీస్ తనిఖీలు ముమ్మరం చేశారు. మండలంలోని శ్రీనగర్ స్టేజీలో ఎస్ఐ రాము ఆధ్వర్యంలో వాహన తనిఖీ నిర్వహించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం తరలించే వారిపై నిఘాను పెంచామన్నారు. లెక్కకు మించి నగదు తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వడ్డేపల్లి మండలం రామాపరం గ్రామానికి చెందిన హరిజన ఆంజనేయులు బైక్ ఏపీ రాష్ట్రం కర్నూల్ పట్టణం నుంచి రామాపురం గ్రామానికి తిరిగి వెళ్తుండగా, శ్రీనగర్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా రూ. 1లక్ష నగదు పట్టుకున్నామన్నారు. ఈ నగదును జోగుళాంబ గద్వాల జిల్లా ట్రెజరీ కార్యాలయానికి పంపామన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని సబ్ డివిజన్ ఆవరణంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఏడీఈ రమేష్ బాబు తెలిపారు. గద్వాల టౌన్, గద్వాల రూరల్, ధరూర్, కేటీదొడ్డి మండలంలోని ఆయా గ్రామాల వినియోగదారులు విద్యుత్ సమస్యలపై లిఖితపూర్వంగా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

అలంపూర్: విద్యుత్ వినియోగదారుల దినోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఏడీఈ చిన్నమక్బుల్ ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ చౌరస్తాలోని ఏడీఈ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి విద్యుత్ సబ్ డిజన్‌లోని ఏఈలు, విద్యుత్ అధికారులు హాజరువుతున్నట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉన్న వినియోగదారులు ఈ సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (పీఆర్‌టీ) ఏర్పాటు చేస్తుండడంతో పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వెంకట్రావ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బీచుపల్లి, ఎర్రవల్లి, కొండేరు, జింకలపల్లి, యాక్తాపురం, కొండపేట గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1-00 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఆయా గ్రామాల రైతులు, ప్రజలు దీనిని గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

సీడ్‌పత్తి రైతుల సమస్యలపై మాట్లాడాలి

గట్టు: రాజకీయ పార్టీల అభ్యర్థులు గద్వాల ప్రాంత సీడ్ పత్తి రైతుల సమస్యలపై మాట్లాడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీవీ నర్సింహ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఆయన మాట్లాడుతూ గద్వాల ప్రాంత విత్తనాలు ఉత్పత్తి చేయడంలో ప్రసిద్ధి గాంచిందని, గతంలో గద్వాల ప్రాంతాన్ని సీడ్ హబ్‌గా మార్చి ప్రాసెసింగ్ యూనిట్లు చేస్తున్నట్లు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ హామీ ఇప్పటికీ నెరవేరలేదన్నారు. గద్వాల ప్రాంతంలో 30 ఏళ్లుగా 40 వేల ఎకరాల్లో సుమారు 25 వేల ఎకరాల్లో సీడ్ పత్తి ద్వారా విత్తనాల ఉత్పత్తి చేసి, దేశ వ్యాప్తంగా నాణ్యమైన విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడ్ రైతులు స్వామి, గోవిందు, వెంకటేష్, ఈరన్న, శాంతన్న, బీమన్న పాల్గొన్నారు.

కుక్కదాడిలో బాలుడికి గాయాలు

గద్వాల క్రైం: కుక్క దాడిలో బాలుడి పరిస్థితి విషమంగా మారిన ఘటన గద్వాల మండలంలోని అనంతపురంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. గ్రామానికి చెందిన సందీప్ ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అక్కడే ఉన్న కుక్క బాలుడిపై విక్షణ రహింతంగా దాడి చేసింది. ఈ దాడిలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, తల్లిదండ్రులు కుక్కను అతి కష్టం మీదుగా చెదరగొట్టారు. చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి



అయిజ: కొన్ని సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన గద్వాల– అయిజ రోడ్డు బింగిదొడ్డి గ్రామ సమీపంలో బీటీరోడ్డు ఒక కి.మీ. మేర గుంతలు పడి పదేళ్లు అవుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లేందుకు వీలులేకుండా రోడ్డు గుంతలు పడింది. ఆ ప్రదేశంలో వాహనాలు ఒకదానికి ఒకటి ఎదురు పడినప్పుడు అనేక సార్లు ప్రమాదాలు జరిగాయి. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రోత్సాహకం అందేనా?

- గ్రామాల్లో సర్పంచ్‌ల కష్టాలు తీరేనా..
- నియోజకవర్గంలో 13 ఏకగ్రీవ పంచాయతీలు.
- ఏళ్లుగా నిధుల కోసం ఎదురుచూపు



తిమ్మాపురం జీపీలో గ్రామసభను నిర్వహిస్తున్న పాలకవర్గం(ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: గ్రామ పంచాయతీలకు ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేసుకుంటే ప్రజల్లో ఐక్యమత్యం పెరిగి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించడం సులభమవుతుందని ప్రభుత్వాలు భావించాయి. దీని కోసం ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం అయ్యే పంచాయతీలకు ప్రత్యేక ప్రోత్సాహకం కింద నిధులు అందించాలని 2001లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. జనాభా ఆధారంగా ఏకగ్రీవ పంచాయతీలకు రూ.7లక్షల వరకు నిధులు మంజూరయ్యేవి. 2019లో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏకగ్రీవ పోత్సాహకాన్ని భారీగా పెంచింది. దీంతో గ్రామాభివృద్ధి కోసం గ్రామస్తులంతా ఏకమై పలు పంచాయతీలను ఎన్నికలు లేకుండానే ఏకగ్రీవం చేశారు. ఏళ్లు గడిచినా నేటి వరకు పోత్సాహక నిధులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాధారణ నిధులతో పాటు అదనంగా..

ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు సాధారణ నిధులతో పాటు పంచాయతీలకు అదనంగా ప్రోత్సాహక నిధులను అందజేస్తారు. ఈ పథకాన్ని దేశంలో మొదటగా 1960లో రాజస్థాన్ రాష్ట్రంలో ప్రారంభించారు. ప్రస్తుతం తెలంగాణ, హరియాణ, గుజరాత్ రాష్ట్రాల్లో మాత్రమే ఏకగ్రీవమయ్యే పంచాయతీలకు ఈ ప్రోత్సాహక పథకం అమలవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2001 నుంచి అమలు చేస్తుండగా, 2006 నుంచి జీపీలకు రాయితీలను ఇస్తున్నారు. అనంతరం 2013లో జీఓ నెంబర్ 1274 ను తీసుకొచ్చి అనంతరం పలు సవరణలు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటయ్యాక అదనంగా కొత్త పంచాయతీలు ఏర్పడ్డాక రాష్ట్రంలో కొత్త పంచాయతీ చట్టంఅమల్లోకి వచ్చింది. దీని ద్వారా ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులను పెంచింది. దీంతో పాత పంచాయతీలతో పాటు కొత్తగా ఏర్పడిన పంచాయతీలు సైతం అభివృద్ధిని ఆకాంక్షించి పలు పంచాయతీలను ఏకగ్రీవం చేసుకున్నాయి. కానీ ఎన్నికలు జరిగి మూడున్నరేళ్లు గడుస్తున్నా నేటికీ నిధులు మంజూరు కాకపోవడంతో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుపుతున్నారు.

నియోజకవర్గంలో 13 ఏకగ్రీవ పంచాయతీలు..

అలంపూర్ నియోజకవర్గంలో 7 మండలాలు ఉండగా, మొత్తం 124 గ్రామ పంచాయతీలు కలవు. అందులో 13 పంచాయతీలు 2019లో జరిగిన గ్రామ పంచాయతీలు ఎన్నికలు లేకుండానే ప్రజల సహకారంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే రూ.15లక్షల నజరానా ఇస్తామని టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. దీని ద్వారా నియోజకవర్గంలో 13 గ్రామ పంచాయతీలకు రూ.1.95 కోట్లను ప్రభుత్వం జమ చేయాల్సి ఉంది. టీఆర్‌ఎస్ ప్రభుత్వం 2019 ఎన్నికల సందర్భంగా రూ.10 లక్షలకు పెంచి, అదనంగా ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 5 లక్షలు కలిపి మొత్తం రూ.15లక్షలు ఇస్తామని ప్రకటించింది. ఎన్నికలు జరిగి నాలుగేళ్లు గడుస్తున్నా నిధులు మంజూరు కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏకగ్రీవ పంచాయతీలకు అందిచాల్సిన ప్రోత్సాహక నిధులను వెంటనే మంజూరు చేసి అప్పులపాలైన సర్పంచులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆయా మండలాల వారీగా ఏకగ్రీవ గ్రామ పంచాయతీలు

మండలం	జీపీలు	ఏకగ్రీవ పంచాయతీలు
ఇటిక్యాల	29	పుటాన్‌దొడ్డి, తిమ్మాపురం, నక్కలపల్లి.
మానపాడు	16	కలుకుంట్ల.
వడ్డేపల్లి	10	తిమ్మాజిపల్లి, వెంకట్రామనగర్.
రాజోళి	11	పడమటి గార్లపాడు.
ఉండవెల్లి	16	భైరాపురం.
అలంపూర్	14	ఏకగ్రీవం కాలేదు.
అయిజ	28	కురవపల్లి, గుడిదొడ్డి, కిష్టాపురం, నౌరోజీ క్యాంపు, కొత్తపల్లి.



పుటాన్‌దొడ్డిలో ఏకగ్రీవ సర్పంచ్‌కు నియామక పత్రం అందిస్తున్న అధికారులు(ఫైల్)

ప్రోత్సాహక నిధులిస్తే మరింత అభివృద్ధి



గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ప్రత్యేక ప్రోత్సాహక నిధుల కోసం గ్రామస్తులమంతా ఏకమై ఎన్నికలు లేకుండానే ఏకగ్రీవం చేసుకున్నాం. గ్రామంలో అదనంగా అభివృద్ధి పనులు చేద్దామంటే ప్రోత్సాహక నిధులు ఇప్పటి వరకు మంజూరు కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రోత్సాహక నిధులను వెంటనే మంజూరు చేస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.

– స్వాతి, సర్పంచ్, పుటాన్‌దొడ్డి

రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి



గ్రామాన్ని అభివృద్ధి చేయడం కోసం గ్రామస్తుల సహకారంతో మా పంచాయతీని ఏకగ్రీవంగా చేసుకున్నాం. ప్రోత్సాహక నిధులు ప్రభుత్వం అందించే రూ.15 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని ఎదురు చూస్తున్నాం. నేటి వరకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం స్పందించి నిధులు అందిస్తే పలు అభివృద్ధి పనులు వెంటనే చేపడతాం.

– నాగేశ్వరి, సర్పంచ్, తిమ్మాపురం

ప్రభుత్వానికి నివేదించాం



మండలంలో ఏకగ్రీవమైన మూడు పంచాయతీల వివరాలను గతంలో ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నిధులు ఆయా పంచాయతీలకు మంజూరు కావల్సి ఉంది. ప్రోత్సాహక నిధులు విడుదల కాగానే ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులకు సమాచారం అందించి ఆయా పంచాయతీల ఖాతాల్లో జమచేస్తాం.

– భాస్కర్, ఎంపీఓ, ఇటిక్యాల

సరిహద్దులపై పోలీస్ ఫోకస్



నందిన్నె చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

కేటీదొడ్డి: ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చెక్‌పోస్ట్ సీఐ నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలను క్షుణంగా తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నగదు, బంగారం తీసుకెళ్లే వారు రశీదులు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేకుంటే నగదు, బంగారాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్, పోలీసులు ఉన్నారు.

గొర్రెలకు, మేకలకు టీకాలు



మండల కేంద్రంలో గొర్రెలకు టీకాలు వేస్తున్న సిబ్బంది

అయిజ: గొర్రెలకు, మేకలకు పారుదు రోగం రాకుండా ప్రభుత్వం చేపట్టిన ఉచిత టీకాల కార్యక్రమం కొనసాగుతోంది.గురువారం మండల కేంద్రంలో, మండలంలోని భైనపల్లిలో వెటర్నరీ సిబ్బంది గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. మొత్తం 1831 గొర్రెలకు, 52 మేకలకు టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూప రాణి పేర్కొన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులందరూ ప్రభుత్వం అందించే ఉచిత టీకాలను వేయించాలని కోరారు.

అభివృద్ధి సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



అమరవాయిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీని గెలిపిస్తాయని గద్వాల ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బూడిదపాడు, అమరవాయి, సద్దలోనిపల్లి, మంగంపేట, అడివిరావలచెర్వు, నేతువానిపల్లి, నేతువానిపల్లితండా, ఉలిగేపల్లి, దాసర్‌పల్లి, బిజ్వారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ భావితరాల బంగారు భవిష్యత్ కోసం ప్రణాళికా బద్ధంగా పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

గద్వాల రూరల్: సీఎం కేసీఆర్ పదేళ్లుగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమాభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. అందులో భాగంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు భారీ ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. గద్వాల పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు జనార్దన్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు భారతి, రంగస్వామి, నరేష్, ఎల్లప్ప, నర్సింహులు, కేటీదొడ్డి మండలం కుచ్చినెర్లకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయ దుబ్బన్న, నాగేష్, గిరీష్, నవీన్, వీరేష్, శరణప్ప, నాగరాజులకు ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్‌ఎస్ బీఫాం వచ్చేది మనకే..

ఎమ్మెల్యే అబ్రహం

ఎర్రవల్లిచౌరస్తా: ఎట్టి పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ పార్టీ బీఫాం వచ్చేది తనకేనని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని చాగాపురం, షాబాద్, ఉదండాపురం, సాతర్ల గ్రామాల్లో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజలంతా తమవెంటే ఉన్నారని, సీఎం కేసీఆర్‌పై తనకు పూర్తి నమ్మకముందని కార్యకర్తలు అధైర్యపడొద్దని అన్నారు. కార్యక్రమంలో జయచంద్రారెడ్డి, శ్రీను, మధునాయుడు, లోకారెడ్డి, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



సాతర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

అక్రమ కేసులు పెట్టడం హేయమైన చర్య



మాట్లాడుతున్న ఇక్బాల్ పాష

గద్వాల అర్బన్: మరికల్ మండలంలోని చిత్తనూర్‌లో ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రెండేళ్లుగా శాంతియుతంగా నిరసన చేస్తున్న ప్రజలపై దాడికి పురమాయించి అక్రమంగా కేసులు బనాయించడం హేయమైన చర్య అని పలువురు వక్తలు పేర్కొన్నారు. పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాష అధ్యక్షతన గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ సంఘాల నాయకులు హాజరై మాట్లాడారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యను ముక్తకంఠంతో ఖండించారు. వెంటనే హైకోర్టు న్యాయమూర్తులతో సమగ్ర విచారణ చేపట్టి దోషులని కఠినంగా శిక్షించాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతాంగ సమితి రాష్ట్ర నాయకుడు గోపాల్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, న్యాయవాది సోమశేఖర్, రైతుసంఘం గోపాల్ రావు ఉన్నారు.

భారత్‌మాల అధికారులతో మాట్లాడిన రైతులు

రాజోళి: మండల కేంద్రం సమీపంలో వేస్తున్న భారత్‌మాల రోడ్డు పనుల వద్ద కొద్ది రోజుల క్రితం రైతులు నిరసన తెలిపారు. గురువారం భారత్‌మాల సిబ్బంది రోడ్డు పనుల దగ్గరకు రావడంతో రైతులు వారితో మాట్లాడారు. భారత్‌మాల రోడ్డు వేస్తున్న క్రమంలో, ఎన్నో ఏళ్లుగా తమ పొలాలకు వెళ్లే దారులు మూత పడుతున్నాయని, పొలాలకు ఇతర మార్గాల గుండా వెళ్లాలంటే, దూరమవుతుందని, పాత బాటలను వదిలేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. నక్ష ప్రకారం బాటల పనులు జరుగుతున్నాయని, అందులో మార్పు చేయడం కుదరదని అధికారులు రైతులకు సూచించారు. మరి కొన్ని చోట్ల కాల్వల ద్వారా పొలాలకు నీరు అందేదని, అక్కడ కూడా భారత్ మాల పనుల వల్ల నీటి ఇబ్బందులున్నాయని రైతులు పేర్కొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న భారత్ మాల అధికారులు


కార్యక్రమంలో తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ, రైతు సమన్వయ సమితి నాయకులు ప్రకాష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గద్వాల కోటపై బహుజన జెండాను ఎగరేద్దాం



గట్టు: గద్వాల కోటపై బహుజన జెండాను ఎగరేద్దామని, ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పించాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ ప్రజలను కోరారు. గురువారం సల్కాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన గ్రామంలో ఇంటింటా తిరుగుతూ సింహం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పించాలని, గద్వాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయనున్నట్లు తెలిపారు. ఓటర్లు సింహం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి గట్టు మండల అధ్యక్షుడు బలరాం, నాయకులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలి



గద్వాల అర్బన్: మహిళలకు 33శాతం రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో విఫలమయ్యాయన్నారు. సమావేశంలో భారతి, మహాదేవి, రమణమ్మ, వెంకటమ్మ ఉన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

ఎర్రవల్లిచౌరస్తా: పట్టపగలే ఇంట్లో చోరీ జరగడంతో కేసు నమోదైన సంఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణదేవా కథనం మేరకు.. మండలంలోని పుటాన్‌దొడ్డికి చెందిన వెంకటరమణారెడ్డి బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటితాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితులు సాయంత్రం ఇంటికొచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో ఉన్న రూ.20 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. గురువారం బాధితుడు పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తికి..

మానవపాడు: జాతీయ రహదారి–44పై ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తిగా యాలైన ఘటన గురువారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని జల్లాపురం గ్రామానికి చెందిన వెంకన్న పనుల నిమిత్తం కర్నూల్ వైపు వెళ్లేందుకు జల్లాపురం స్టేజీ సమీపంలో నిల్చున్నాడు. కొద్ది సేపటికి హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు బైక్ వెళ్తుండగా లిఫ్ట్ అడిగి ఎక్కాడు. ఎదురుగా మరో బైక్ వచ్చి ఢీ కొట్టడంతో వెంకన్న తలకు, చేతులకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అయన్ని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

కేటీదొడ్డి: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్తేనే సాధ్యమవుతుందని ఎంపీపీ మనోరమ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు మాట్లాడారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలుంటే ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్, ఏఓ మహాలక్ష్మి, ఎంపీఓ సయ్యద్‌ఖార్ పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మనోరమ

కేసీఆర్ సభను విజయవంతం చేయండి



బూరెడ్డిపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

ధరూరు: ఈ నెల 6న జరగబోయే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్ కుమార్, మండల వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిలు కోరారు. గురువారం మండలంలోని బూరెడ్డిపల్లి, ఓబులోనిపల్లి, మార్లబీడు, ర్యాలంపాడు గ్రామాల్లో బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, డీఆర్ శ్రీధర్, రాజారెడ్డి, వెంకటేష్ నాయుడు, గోపాల్ రెడ్డి, విజయసింహారెడ్డి, కర్రెప్ప, దౌలన్న అబ్రహం, సుధాకర్‌రెడ్డి, కుర్వ శ్రీను పాల్గొన్నారు.

కేటీ దొడ్డి: జోగుళాంబ గద్వాలలో 6న సోమ వారం జరగనున్న ప్రజాఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరవుతారని,పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మె ల్యే తనయుడు బండ్ల సాయిసాకేతన్ రెడ్డి, ఎంపీపీ మనోరమ, జెడ్పీటీసీ రాజశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని గురువారం సీఎం కేసీఆర్ పోస్టర్ విడుదల చేసి మాట్లాడారు. గ ద్వాల పట్టణంలోని మార్కెట్ యార్డు వెనక భాగంలో ఈ నెల 6న ఉదయం 11 గంటలకు ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు తరలొచ్చి విజయవంతం చేయాలని కోరారు. వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, సర్పంచులు మైబు, గోపాల్, సత్య న్న, నాయకులు చక్రధర్, గోపి, నవీన్‌కుమార్, జానీ ఉన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన



నెట్టెంపాడు శివారులో ఆయిల్ ఫాం రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాజశేఖరరెడ్డి

ధరూరు: మండలంలోని నెట్టెంపాడులో రైతు చెన్నయ్య సాగు చేసిన ఆయిల్ ఫాం తోటలో చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. గురువారం గ్రామ శివారులోని ఆయిల్ ఫాం తోటలో ఆయా గ్రామాల రైతులకు యాజమాన్య పద్ధతులు, పంటకు ప్రధానంగా సోకే రోగాలు, చీడపీడల నివారణపై ఆయిల్ ఫాం శాస్త్రవేత్త రాజశేఖరరెడ్డి అవగాహన కల్పించారు. కొమ్ము పురుగు నివారణ, జీవ నియంత్రణ పద్ధతులపై వివరించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ చంద్రమోహన్, ఫీల్డ్ ఆఫీసర్ శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

పథకాలే ప్రజలకు శ్రీరామరక్ష

శాంతినగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన వివిధ పథకాలు నిరుపేదలకు శ్రీరామరక్షలా ఉపయోగపడుతున్నాయని అలంపూర్ టికెట్ ఆశిస్తున్న విజేయుడు అన్నారు. వడ్డేపల్లి మండలంలోని కొంకలలోని భీమిరెడ్డి నగర్‌లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు తిరుగుతూ కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివంచాడు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పుల్లూరు నాగేశ్వర్‌రెడ్డి, రఘురెడ్డి, మహిపాల్‌రెడ్డి, మాణిక్యారెడ్డి, అమర్‌యాదవ్, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు టీ గోపాల్, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎనుముల వెంకట్రాములు, రఘువర్ధన్‌రెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కొంకల భీమన్న, రాజరెడ్డి, రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, నాగన్న పాల్గొన్నారు.

రాజోళి: కేసీఆర్ అంటేనే రైతు బాంధవుడని, ఆయన సీఎం అయ్యాక రాష్ట్రంలో వ్యవసాయం పండుగగా మారిందని అలంపూర్ బీఆర్‌ఎస్ టికెట్ ఆశిస్తున్న విజేయుడు అన్నారు. గురువారం మండలంలోని ముండ్లదిన్నె, పెద్ద తాండ్రపాడు, తుమ్మిళ్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు బృహత్తర పథకాలు అందించడమే కాకుండా, వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందించి వారి బాసటగా నిలిచిన వ్యక్తి కేసీఆర్ అని, ఆయన పాలనకు మరొక అవకాశమిచ్చి బంగారు తెలంగాణ సాధిద్దామన్నారు.



కొంకలలో ప్రచారం నిర్వహిస్తున్న విజేయుడు